ప్రజాశక్తి
బుధవారం 29 మార్చి 2023 5 శ్రీకాకుళం



క్రమశిక్షణ తప్పితే సస్పెన్షన్ తప్పదు

నరసన్నపేట : శాసనసభ్యుల కోటా ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రత్యర్థులతో చేతులు కలిపి సొంత పార్టీ అభ్యర్థిని ఓడించిన ఎమ్మెల్యేలను వైసిపి నుంచి బహిష్కరించడం సమంజసమేనని వైసిపి జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వైసిపి ఎమ్మెల్యేలుగా ఉంటూ ఆనం రామనారాయణ రెడ్డి, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, మేకపాటి చంద్రశేఖర్ రెడ్డి, ఉండవల్లి శ్రీదేవి పార్టీ నిర్దేశించిన ఎమ్మెల్సీ అభ్యర్థికి వ్యతిరేకంగా ఓటు వేసినట్లు నిర్ధారించుకున్న తర్వాతే పార్టీ క్రమశిక్షణ కమిటీ వారిపై సస్పెన్షన్ వేటు వేసిందని తెలిపారు. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడిన ఆ నలుగురు ఎమ్మెల్యేలు రాజీనామా చేసి వారికి నచ్చిన పార్టీ నుంచి పోటీ చేస్తే ఎవరి బలం ఏంటో తేలిపోతుందని పేర్కొన్నారు. ఒక్క ఎమ్మెల్సీ సీటుతో టిడిపి అతిగా ఊహించుకుంటోందని తెలిపారు. కోవిడ్ సమయంలో ఉండవల్లి శ్రీదేవి తీవ్ర అస్వస్థతకు గురైతే స్పెషల్ ఫ్లైట్ పెట్టి సిఎం జగన్ ఆమె ప్రాణాలు కాపాడారని పేర్కొన్నారు. ఈరోజు ఆయన నుంచే ప్రాణహాని ఉందని శ్రీదేవి, చంద్రబాబు స్క్రిప్ట్ చదువుతున్నారని విమర్శించారు.

'పది'లో ప్రథమానికి కసరత్తు

- గతేడాది రాష్ట్రంలో రెండో స్థానం దక్కించుకున్న జిల్లా
- ఈ సంవత్సరం మరింత పట్టుదలతో పనిచేస్తున్న విద్యాశాఖ
- అందరూ ఉత్తీర్ణులయ్యేలా యాక్షన్ ప్లాన్ అమలు
- పరీక్షలకు కఠోరంగా శ్రమిస్తున్న విద్యార్థులు

పదో తరగతి ఫలితాల్లో గతేడాది ఉత్తీర్ణతా శాతంలో రాష్ట్రంలో జిల్లా రెండో స్థానంలో నిలిచిన సంగతి తెలిసిందే. ఈ ఏడాది ప్రథమ స్థానంలో నిలపాలని జిల్లా విద్యాశాఖ పట్టుదలగా ఉంది. ప్రభుత్వ పాఠశాలల్లో అత్యుత్తమ ఫలితాల సాధనకు అవసరమైన ప్రణాళికలను రూపొందించి అమలు చేస్తోంది. డైలీ ఆన్‌లైన్ టెస్ట్ (డిఒటి) నిర్వహించడంతో పాటు సమగ్ర మెటీరియల్‌ను ఇప్పటికే పంపిణీ చేసింది. అత్యంత వెనుకబడిన విద్యార్థులు సైతం కనీసం పాస్ మార్కులు సాధించేలా ఉపాధ్యాయులు తర్ఫీదునిస్తున్నారు. పదో తరగతిలో తమ పాఠశాలలు ప్రథమ స్థానంలో నిలవాలన్న పోటీతో ప్రధానోపాధ్యాయులు, సబ్జెక్టు టీచర్లు పోటీ పడుతున్నారు.

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

జిల్లాలో ఈ సంవత్సరం పదో తరగతి పరీక్షలకు 29,575 మంది విద్యార్థులు హాజరు కానున్నారు. వీరిలో రెగ్యులర్ విద్యార్థులు 28,855 మంది, ప్రయివేట్‌గా రాస్తున్నవారు 720 మంది ఉన్నారు. రెగ్యులర్ విద్యార్థుల్లో 14,770 మంది బాలురు, 14,085 మంది బాలికలు ఉన్నారు. ప్రయివేట్‌గా హాజరవుతున్న విద్యార్థుల్లో 456 మంది బాలురు, 264 మంది బాలికలు ఉన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో పరీక్షలు రాస్తున్న విద్యార్థులందరూ ఉత్తీర్ణులయ్యేలా విద్యాశాఖ పటిష్ట కార్యాచరణ రూపొందించి అమలు చేస్తోంది. నైపుణ్యం గల ఉపాధ్యాయులతో రూపొందించిన ప్రశ్నాపత్రాలతో జనవరి 23 నుంచి డైలీ ఆన్‌లైన్ టెస్టులు నిర్వహిస్తున్నారు. ప్రతిరోజూ తరగతుల ప్రారంభానికి ముందు ఒక గంట, తరగతులు పూర్తయిన తర్వాత ఒక గంట చదివిస్తున్నారు. చదువులో విద్యార్థులు చూపుతున్న ప్రగతి ఆధారంగా ఎ, బి, సి, డి గ్రేడ్‌లుగా విభజించి సి, డి గ్రేడ్ విద్యార్థులపై ప్రత్యేక దృష్టిసారిస్తున్నారు. అత్యంత వెనుకబడిన విద్యార్థులను ఉపాధ్యాయులు దత్తత తీసుకుని ప్రత్యేకంగా చదివిస్తున్నారు. పదో తరగతి సిలబస్‌లో మంచి నిపుణులైన వారితో రూపొందించిన సమగ్ర మెటీరియల్‌ను అందించారు. వెనుకబడిన విద్యార్థులు కనీసం పాస్ మార్కులు పొందేలా ప్రణాళికలను అమలు చేస్తున్నారు. విద్యార్థులు ఇంటి వద్ద చదువుతున్నదీ, లేనిదీ రాత్రివేళలో ఉపాధ్యాయులు స్వయంగా పర్యవేక్షిస్తున్నారు.



ఒప్పంగి జెడ్‌పి ఉన్నత పాఠశాలలో విద్యార్థులను చదివిస్తున్న ఉపాధ్యాయులు

తల్లిదండ్రులతో ప్రత్యేక సమావేశాలు

తల్లిదండ్రులు, పేరెంట్స్ కమిటీలతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించారు. పరీక్షలకు విద్యార్థులను సిద్ధం చేసిన తీరును వివరించారు. విద్యార్థులు ఇంటి వద్ద చదివేలా తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని సూచించారు. విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్న నేపథ్యంలో వారు ఆరోగ్యంగా ఉండేలా పౌష్టికాహారం అందించాలని చెప్పారు.

పాఠశాలల యాజమాన్యాల వారీగా ఈ సంవత్సరం పరీక్షలు రాస్తున్న విద్యార్థుల వివరాలు

యాజమాన్యం	రెగ్యులర్	ప్రయివేట్	మొత్తం
ఎపి మోడల్ స్కూల్స్	1249	0	1249
ఎపి రెసిడెన్షియల్ స్కూల్స్	159	0	159
ఎస్‌డబ్ల్యుఆర్‌ఇఐ స్కూల్స్	546	12	558
టిడబ్ల్యుఆర్ స్కూల్స్	68	0	68
ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు	2,584	112	2,696
జిటిడబ్ల్యుఎహెచ్	733	38	771
కెజిబివి స్కూల్స్	1000	16	1016
ఎంజెపి ఎపి బిసిడబ్ల్యుఆర్ స్కూల్స్	380	2	771
మున్సిపల్ హైస్కూల్స్	1173	46	1219
ప్రయివేట్ అన్ ఎయిడెడ్ స్కూల్స్	6,506	45	6,551
జెడ్‌పి ఉన్నత పాఠశాలలు	14,457	449	14,906
మొత్తం	**28,855**	**720**	**29,575**

విద్యార్థులకు ఉపయుక్తంగా యుటిఎఫ్ మెటీరియల్

ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ ఏడాదీ యుటిఎఫ్ పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను అందించింది. జిల్లావ్యాప్తంగా 450 పాఠశాలలకు మొత్తం 2,500 పుస్తకాలను అందించింది. స్టడీ మెటీరియల్ ఎంతగానో ఉపయుక్తంగా ఉందనే అభిప్రాయం విద్యార్థుల్లో వ్యక్తమవుతోంది.

ఐదేళ్లలో ఉత్తీర్ణతా శాతం వివరాలు

సంవత్సరం	హాజరైన వారు	ఉత్తీర్ణులైన వారు	ర్యాంకు
2018	37,549	36,265	4
2019	28,286	36,595	6
2020	38,179	38,179	-
2021	37,715	37,715	-
2022	35,944	28,115	2

(2020, 2021 సంవత్సరాల్లో కరోనా కారణంగా పరీక్ష రాయడానికి సిద్ధమైన వారందరినీ ప్రభుత్వం ఉత్తీర్ణులుగా ప్రకటించింది)

మెరుగైన ఉత్తీర్ణతా శాతం సాధనకు కృషి



పదో తరగతి ఫలితాల్లో ఈ సంవత్సరం మెరుగైన ఉత్తీర్ణతా శాతం సాధించడమే లక్ష్యంగా పెట్టుకున్నాం. గతేడాది డైలీ ఆన్‌లైన్ టెస్టులతోనే మంచి ఫలితాలు సాధించగలిగాం. ఈ సంవత్సరం కూడా అదే విధానాన్ని అమలు చేశాం. నిష్ణాతులైన ఉపాధ్యాయులు రూపొందించిన స్టడీ మెటీరియల్‌ను విద్యార్థులకు అందించాం. అత్యంత వెనుకబడిన విద్యార్థి సైతం ఉత్తీర్ణులయ్యేలా చర్యలు తీసుకుంటున్నాం. మంచి ఫలితాలు సాధించేందుకు ప్రధానోపాధ్యాయులతో పాటు సబ్జెక్టు టీచర్లు పోటీ పడి పనిచేస్తున్నారు.

- జి.పగడాలమ్మ, జిల్లా విద్యాశాఖ అధికారి

31న మన్యం బంద్

జయప్రదం చేయండి : గిరిజన సంఘం

ప్రజాశక్తి - మందస



సమావేశంలో మాట్లాడుతున్న ధర్మారావు

బోయ, వాల్మీకులను ఎస్‌టి జాబితాలో చేర్చవద్దని డిమాండ్ చేస్తూ ఈనెల 31వ తేదీన మన్యం బంద్‌ను చేపడుతున్నట్లు గిరిజన సంఘం మందస మండల కార్యదర్శి ఎస్.ధర్మారావు తెలిపారు. బంద్‌ను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. బంద్ సన్నాహక సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఇప్పటికే గిరిజనులకు చెందిన అనేక హక్కులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కాలరాస్తున్నాయని విమర్శించారు. గిరిజన జనాభా ప్రాతిపదికన నిధులు కేటాయింపు గానీ, సంక్షేమ పథకాలు గానీ అమలు చేయడం లేదన్నారు. బోయ, వాల్మీకులను గిరిజనుల్లో చేర్చడం ద్వారా గిరిజనులు మరిన్ని హక్కులు కోల్పోతారని ఆందోళన వ్యక్తం చేశారు. మన్యం బంద్‌కు ప్రజలు మద్దతునిచ్చి గిరిజన ప్రజల హక్కులను రక్షించాలని కోరారు. సమావేశంలో గిరిజన సంఘ నాయకులు ఎస్.గురునాథ్, ఎస్.రామారావు, వై.భాస్కరరావు, ఎస్.గోవింద్, రాందాస్ తదితరులు పాల్గొన్నారు.

అలా చేస్తే మహిళలకు కష్టాలే

రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు

ప్రజాశక్తి - శ్రీకాకుళం

మహిళలు ఇచ్చిన అధికారంతోనే ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. ఆ అధికారం లేకపోతే మళ్లీ మహిళలకు కష్టాలు తప్పవని హెచ్చరించారు. ఇప్పుడు అమలవుతున్న పథకాలన్నీ వర్తించాలంటే జగన్‌కే మళ్లీ పట్టం కట్టాలన్నారు. వైఎస్సార్ ఆసరా పథకం మూడో విడతలో భాగంగా మండలంలోని కిల్లిపాలెం, నగరంలోని హడ్కో కాలనీలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడారు. మహిళల ఆర్థిక ప్రగతికి ఆసరా పథకం నాంది అని అన్నారు. అందులో భాగంగా బ్యాంకులకు డ్వాక్రా సంఘాలు బకాయిపడిన రుణాలను నాలుగు విడతలుగా తీర్చేందుకు సిఎం జగన్ నిర్ణయించారని, ఇప్పటికే మూడు విడతల్లో చెల్లింపులు పూర్తయ్యాయని చెప్పారు. మగువల ఆర్థిక స్వావలంబనకు ముఖ్యమంత్రి చర్యలు చేపట్టారని చెప్పారు. అందులో భాగంగానే ఆసరాను అమలు చేస్తున్నారని తెలిపారు.

బెస్ట్ అనిపించుకుంటారా? వేస్ట్ అనిపించుకుంటారా?

మహిళలను నమ్ముకున్న జగన్‌కు కృతజ్ఞత చూపించి బెస్ట్ అనిపించుకుంటారా?, చంద్రబాబుకు ఓటు వేసి వేస్ట్ అనిపించుకుంటారా? అన్నది మీపైనే ఆధారపడి ఉందన్నారు. గతంలోనూ చంద్రబాబు కొన్ని మాటలు చెప్పారని, వాటిని నిలబెట్టుకోలేదని చెప్పారు. జగన్ మాత్రం ఇచ్చిన మాట ప్రకారం అన్ని పథకాలనూ అమలు చేస్తున్నారని తెలిపారు. గత ప్రభుత్వంలో అందిన, వైసిపి ప్రభుత్వం అందిస్తున్న పథకాలను బేరీజు వేసుకోవాలని సూచించారు. సంక్షేమాన్ని అందిస్తున్న ప్రభుత్వానికి మద్దతుగా నిలవాలని కోరారు. అనంతరం డ్వాక్రా మహిళలకు నమూనా చెక్కును అందజేశారు. కార్యక్రమంలో డిఆర్‌డిఎ పీడీ విద్యాసాగర్, కార్పొరేషన్ కమిషనర్ ఓబులేసు, వైసిపి నాయకులు ధర్మాన రామ్ మనోహర్ నాయుడు, కార్పొరేషన్ల చైర్మన్లు మామిడి శ్రీకాంత్, అంధవరపు సూరిబాబు, మహిళా కమిషన్ మాజీ చైర్మన్ త్రిపురాన వెంకటరత్నం, ఎంపిపి అంబటి నిర్మల, జెడ్‌పిటిసి రుప్ప దివ్య, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ఎం.వి పద్మావతి, చింతాడ మంజుల, అంబటి శ్రీనివాసరావు, చిట్టి జనార్ధనరావు తదితరులు పాల్గొన్నారు.




నమూనా చెక్కును అందజేస్తున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు

అరసవల్లి ఆలయ అభివృద్ధికి కృషి

ప్రజాశక్తి - అరసవల్లి

అరసవల్లి ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. ఆలయ నూతన పాలకమండలి సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయ కార్యక్రమాల్లో ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా ఆలయ ఆస్తులను, చట్టాలను పరిరక్షిస్తూ పాలకమండలి సభ్యులు పనిచేయాలని సూచించారు. ఆలయ విస్తరణ, ఆధునికీకరణకు చాలా చేయాల్సి ఉందన్నారు. మాస్టర్ ప్లాన్‌కు అనుగుణంగా భూమిని కొనుగోలు చేయాల్సి ఉందని తెలిపారు. ఆలయ అభివృద్ధి సహకరించాలని స్థానికులను కోరారు. ఆలయాలకు సంబంధించిన చట్టాల్లో మార్పులు చేయాల్సి ఉందన్నారు. సర్వీస్ ఇనాం భూములకు సంబంధించిన హక్కులు వారికి ఇచ్చేద్దామని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి భావిస్తున్నారని తెలిపారు. దేవాలయ భూములు మాత్రం ఆలయానికే చెందుతాయని స్పష్టం చేశారు. ఆలయంపై ఆధారపడే క్షౌరవృత్తిదారులకు వేతనంగా మరో రూ.పది వేలు పెంచి రూ.20 వేలు ఇచ్చే అవకాశముందని తెలిపారు. నిరంతరం సంకీర్తన వినిపించే మంగళవాద్యకారులకు సంబంధించి ఒకరిని ట్రస్టు బోర్డు సభ్యునిగా తీసుకున్నట్లు చెప్పారు.

పాలక మండలికి సంబంధించి ఎక్స్ అఫీషియో సభ్యునిగా ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ, వ్యవస్థాపక ధర్మకర్తగా ఇప్పిలి జోగి సన్యాసిరావు వ్యవహరిస్తారు. ధర్మకర్తలుగా మండవిల్లి రవి, దుక్క గన్నిరాజు, జె.శ్రీనివాస్, మైలపిల్లి లక్ష్మీ జగదీశ్వరరావు, ద్వారపు అనురాధ, జోగి మల్లెమ్మ, ఎన్.కోటేశ్వర చౌదరి, కొంచాడ సోమేశ్వరరావు, ఎల్.లోకేశ్వరి, ఎల్.గోవిందరావు ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో ఆలయ ఇఒ హరిసూర్యప్రకాష్, వైసిపి నాయకులు ధర్మాన రామ్ మనోహర్ నాయుడు, తూర్పు కాపు కార్పొరేషన్ చైర్మన్ మామిడి శ్రీకాంత్, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ఎం.వి పద్మావతి, సాధు వైకుంఠరావు, శిమ్మ రాజశేఖర్, మెంటాడ స్వరూప్, పైడి మహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



పాలకమండలి సభ్యులతో మంత్రి ధర్మాన ప్రసాదరావు



పారిశుధ్య నిర్వహణను పరిశీలిస్తున్న మంత్రి అప్పలరాజు

పారిశుధ్యంపై ఫిర్యాదులు రాకూడదు

పశుసంవర్ధకశాఖ మంత్రి అప్పలరాజు

పలాస : పలాస-కాశీబుగ్గ కెటి రోడ్డులో పారిశుధ్య నిర్వహణలో మార్పు రావాలని రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రి సీదిరి అప్పలరాజు మున్సిపల్ అధికారులకు సూచించారు. పారిశుధ్యంపై ఫిర్యాదులు వస్తే సహించేది లేదని హెచ్చరించారు. మున్సిపాల్టీలోని 14వ వార్డులో గుడ్ మార్నింగ్ పలాస కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. కెటి రోడ్డులో పారిశుధ్య పనులను పరిశీలించారు. ప్రతి దుకాణంలో డస్ట్ బిన్‌లను ఏర్పాటు చేయాలని, ఆ చెత్తను మున్సిపల్ చెత్త బండిలో వేయాలని సూచించారు. రోడ్డుపై చెత్తను పారబోస్తే కఠిన చర్యలు చేపట్టాలన్నారు. మున్సిపల్ అధికారులు, పారిశుధ్య కార్మికులు చొరవ చూపి పారిశుధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా లేకుండా చూడాలని ఆదేశించారు. మున్సిపాల్టీ పరిధిలోని అన్ని వార్డులో విధిగా తనిఖీలు చేపట్టాలన్నారు. రోడ్లపై, కూడళ్లలో చెత్తకుప్పలు ఉంచరాదని, పారిశుధ్య నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ బోర బుజ్జి, మున్సిపల్ కమిషనర్ రాజగోపాల్, సిఐ శ్రీనివాసరావు, స్థానిక కౌన్సిలర్ బెల్లాల శ్రీనివాసరావు, మున్సిపల్ మాజీ చైర్మన్ కోత పూర్ణచంద్రరావు, మున్సిపల్ విప్ శంకర్ పండా, నియోజకవర్గ సచివాలయాల కన్వీనర్ బడగల బల్లయ్య, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

'అమృత జలధార'కు ఆర్థికసాయం

కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం



మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

షెడ్యూల్ కులాల యువ పారిశ్రామికవేత్తల పథకం, అమృత జలధారకు ఆర్థిక సాయం అందించనున్నట్లు కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ అన్నారు. 2022-23లో ఎస్‌సి రైతుల వ్యవసాయ నీటిపారుదల సౌకర్యం, ఆదాయ ఉత్పాదక కార్యకలాపాల కోసం యువ పారిశ్రామికవేత్తల పథకం, అమృత జలధారకు ఆర్థిక సహాయం అందించేందుకు ప్రధానమంత్రి అనుచిత్ జాతి అభ్యుదయ యోజనపై సంబంధిత శాఖల అధికారులతో కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో మంగళవారం కన్వర్జెన్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంజిఎన్‌ఆర్‌ఎ, వ్యవసాయం, ఎపిసిఎన్‌ఎఫ్, పరిశ్రమలు, భూగర్భజలాలు, ఎల్‌డిఎం, ఎన్‌ఇడిసిఎఫ్, ఎస్‌సి కార్పొరేషన్ సంబంధిత శాఖలు అర్హులైన ఎస్‌సి లబ్ధిదారులను గుర్తించాలన్నారు. అర్హుల జాబితాను మార్చి 29వ తేదీ లోగా ఎస్‌సి కార్పొరేషన్ ఇడికి అందిస్తే, జాబితాను అప్‌లోడ్ చేస్తారని చెప్పారు. జిల్లాలో కమ్యూనిటీ సహజ రైతుల కోసం విత్తనం ఇతర అనుబంధ పనిముట్లను సేకరించేందుకు రూ.పది వేల ఆర్థిక సహాయం అందించడానికి 344 మంది ఎపిఎన్‌ఎఫ్ రైతులను గుర్తించినట్లు చెప్పారు. అర్హులైన రైతులు ఆర్థిక సహాయం కోసం వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయడానికి వారి పేర్లను ఫార్వార్డ్ చేయడానికి స్థానిక రైతుభరోసా కేంద్రాలు, క్లస్టర్ రిసోర్స్‌పర్సన్లను సంప్రదించాలని సూచించారు. జిల్లా వ్యవసాయాధికారి, డిపిఎం, ఎస్‌సి కార్పొరేషన్ ఇడి జిల్లాలో ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులకు గరిష్టంగా అర్హత కలిగిన విత్తనాన్ని అందించేందుకు తగిన చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో వ్యవసాయ శాఖ సంయుక్త సంచాలకులు శ్రీధర్, డ్వామా పీడీ జి.వి చిట్టిరాజు, ఎస్‌సి కార్పొరేషన్ ఇడి రామారావు, పరిశ్రమల శాఖ డీడీ ఉమామహేశ్వరరావు, డిపిఎం రేవతి, భూగర్భజలశాఖ డీడీ సత్యజీవన్ తదితరులు పాల్గొన్నారు.

నేడు జాబ్‌మేళా

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

శ్రీకాకుళం నగరంలోని డిఎల్‌టిసి ఐటిఐ కార్యాలయంలో పలురకాల ఉద్యోగాల కోసం ఈనెల 29వ తేదీన జాబ్‌మేళాను నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి అధికారి జి.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌లోని ఆర్ఎస్ టెలీ సర్వీసెస్ నెట్‌వర్క్ ఇంజినీర్ పోస్టులకు పదో తరగతి లేదా ఐటిఐ లేదా డిప్లమో చదివి ఉండాలని స్పష్టం చేశారు. అభ్యర్థులు 18 నుంచి 36 సంవత్సరాల మధ్య వయసు ఉన్న వారు అర్హులని పేర్కొన్నారు. నెలకు రూ.17 వేల నుంచి రూ.25 వేల వేతనం ఉంటుందని తెలిపారు. అనంతపురంలో కియా మోటార్సులో కస్టమర్ సర్వీస్ ఎగ్జిక్యూటివ్ పోస్టుకు డిప్లమో లేదా బిటెక్ చదివి 18 నుంచి 36 సంవత్సరాల వయసు ఉన్న వారు అర్హులని పేర్కొన్నారు. నెలకు రూ.13,500 నుంచి రూ.20 వేల వరకు వేతనం లభిస్తుందని తెలిపారు. హైదరాబాద్‌లోని హెచ్‌డిబి ఫైనాన్షియల్ సర్వీసెస్‌లో ఉద్యోగం కోసం డిగ్రీ చదివిన 18 నుంచి 36 సంవత్సరాలు వయసు కలిగిన వారు అర్హులని పేర్కొన్నారు. నెలకు రూ.13,500 నుంచి రూ.20 వేల వరకు వేతనం ఉంటుందని తెలిపారు.

విశాఖపట్నంలోని సుశ్రిత ఇన్‌ఫ్రాలో మార్కెటింగ్ మేనేజర్ పోస్టుకు ఎస్‌ఎస్‌సి, ఇంటర్, డిగ్రీ చదివి 18 నుంచి 28 సంవత్సరాల వయసు కలిగి ఉండాలని పేర్కొన్నారు. నెలకు రూ.15 వేల నుంచి రూ.18 వేల వరకు వేతనం ఉంటుందని తెలిపారు. విశాఖ, హైదరాబాద్‌లో 2050 హెల్త్ కేర్‌లో నర్సింగ్ అసిస్టెంట్, హోమ్‌కేర్ నర్సు, క్రిటికల్ నర్సు పోస్టులకు జిడిఎ, ఎంపిహెచ్‌డబ్ల్యు, ఎఎన్ఎం, జిఎన్ఎం కోర్సుల్లో ఏదైనా చదివి 19 నుంచి 30 సంవత్సరాల వయసు ఉండాలని పేర్కొన్నారు. నెలకు రూ.9 వేల నుంచి రూ.24 వేల వరకు చెల్లిస్తారని తెలిపారు. ఆసక్తి గల యువతీ యువకులు తమ బయోడేటా, సర్టిఫికేట్లు, ఆధార్ కార్డు, నాలుగు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలతో బుధవారం ఉదయం పది గంటలకు హాజరు కావాలని సూచించారు.

ట్రిపుల్ ఐటిలో తాగునీటికి తక్షణ చర్యలు

ప్రజాశక్తి - ఎచ్చెర్ల



బోరు వేయిస్తున్న ట్రిపుల్ ఐటి అధికారులు

మండలంలోని ఎస్ఎంపురంలో గల ట్రిపుల్ ఐటిలో తాగునీటి కల్పనకు తక్షణ చర్యలు చేపడుతున్నట్లు శ్రీకాకుళం ట్రిపుల్ ఐటి డైరెక్టర్ పి.జగదీశ్వరరావు తెలిపారు. ట్రిపుల్ ఐటిలో తాగునీటి బోరు బావులు కలుషితమైన నేపథ్యంలో ఎస్ఎంపురం పెద్ద చెరువు వద్ద రెండు బోరు బావులను మంగళవారం వేశారు. ఈ రెండు బోరు బావులతో కొంతమేర నీటి సమస్యను అధిగమించ గలమని తెలిపారు. రానున్న కాలంలో ఈ క్యాంపస్‌లో ఇంజినీరింగ్ మూడు, నాలుగో సంవత్సరం కోర్సుల నిర్వహణకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. క్యాంపస్ కొండ ప్రాంతంలో ఉండడం వల్ల భూగర్భ జలాల లభ్యత తక్కువగా ఉందన్నారు. నాగావళి నది నుంచి ప్రత్యేక నీటి సరఫరా, ఎస్ఎంపురం పెద్ద చెరువులో ఇన్‌ఫిల్టరేషన్ బావి వేయడం వల్ల నీటి సమస్యను అధిగమించవచ్చని భావిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఒఎస్‌డి సుధాకర్‌బాబు, పరిపాలన అధికారి ముని రామకృష్ణ, డీన్ మోహన్‌కృష్ణ, ఇంజినీరు తేజకిరణ్, పిఆర్ఒ ఎం.షణ్ముఖ తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా కారుణ్య నియామకాలు

శ్రీకాకుళం : కారుణ్య నియామకాలను పారదర్శకంగా చేపట్టినట్లు జిల్లాపరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ అన్నారు. జిల్లా పరిషత్‌లో పలు కేడర్లలో పనిచేస్తూ మృతి చెందిన ఉపాధ్యాయ, ఉద్యోగుల కుటుంబసభ్యులు పది మందికి తన ఛాంబరులో కారుణ్య నియామక పత్రాలను మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నియామక పత్రాలు పొందిన ఉద్యోగులు విధి నిర్వహణలో ఎటువంటి అలసత్వం లేకుండా నిబద్ధతతో పనిచేసి జిల్లాపరిషత్‌కు మంచి పేరు తీసుకురావాలని కోరారు. ఐదుగురికి టైపిస్టులు, మరో ఐదుగురికి ఆఫీస్ సబార్డినేట్లుగా పలు పాఠశాలలు, కార్యాలయాల్లో నియమించినట్లు తెలిపారు. పలు కార్యాలయాల్లో ఆఫీస్ సబార్డినేట్లుగా పనిచేస్తున్న ఎ.తిరుమలరావు, వై.ప్రమీల, కె.నాగభూషణరావు, ఎం.ఎస్ భగవాన్‌రెడ్డికి రికార్డు అసిస్టెంట్లుగా ఉద్యోగోన్నతులు కల్పిస్తూ ఉత్తర్వులను అందజేశారు. కార్యక్రమంలో జెడ్‌పి ముఖ్య కార్యనిర్వహణాధికారి ఆర్.వెంకట్రామన్, పరిపాలనాధికారి డి.వి.ఆర్ ప్రసాద్, జిల్లా పరిషత్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'ధర్మాన'లో అభద్రతాభావం : గుండ

ప్రజాశక్తి- శ్రీకాకుళం

రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు ఇటీవల కాలంలో చేస్తున్న వ్యాఖ్యలు ఆయనలో పెరుగుతున్న అభద్రతాభావానికి నిదర్శనంగా నిలుస్తున్నాయని మాజీ మంత్రి, తెలుగుదేశం పార్టీ నాయకులు గుండ అప్పలసూర్యనారయణ వ్యాఖ్యానించారు. తన నివాసంలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. మంత్రి ఇటీవల చేస్తున్న పలు వ్యాఖ్యలను పరిశీలించిన తర్వాత సీనియర్ నాయకుడిగా స్పందిస్తున్నానని అన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికలకు ముందువరకు ఉత్తరాంధ్రకు ప్రత్యేక రాష్ట్రం కావాలని ధర్మాన డిమాండ్ చేసిన విషయాన్ని ప్రస్తావించారు. ప్రత్యేక రాష్ట్రం డిమాండ్ తమను తప్పుదోవ పట్టించేదిగా భావించినందునే ప్రజలు వైసిపికి వ్యతిరేకంగా ఓటు వేశారన్నారు. రాజకీయాలు ఎప్పుడూ ఒకేలా ఉండవని, సమాజ పరినామాలను బట్టి మారుతుంటాయని అన్నారు. ఈయనతో పాటు నగర టిడిపి ప్రధాన కార్యదర్శి విజ్జి నాగభూషణం, మాజీ కౌన్సిలర్ గంగు నాగేశ్వరరావు, తీనీస్, జిల్లా కేస్ సోషల్ ఇండియా ప్రతినిధి బుక్క యుగంధర్, తెలుగు యువత నేత అరవింద్ మహాదేవ్ తదిరులు పాల్గొన్నారు.



సమీక్షిస్తున్న చైర్‌పర్సన్ రాజ్యలక్ష్మి

తాగునీరు, పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి

మున్సిపల్ చైర్‌పర్సన్ రాజ్యలక్ష్మి

ఇచ్ఛాపురం: మున్సిపాలిటీ పరిధిలోని వేసవి, స్వేచ్ఛావతి అమ్మవారు సంబరాలు దృష్ట్యా తాగునీటి సరఫరా, పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టిసారించాలని చైర్‌పర్సన్ పిలక రాజ్యలక్ష్మి సూచించారు. పురపాలక సంఘంలో చైర్‌పర్సన్ ఛాంబర్‌లో కమిషనర్ రమేష్ అధ్యక్షతన తాగునీటి సరఫరా, పారిశుధ్య నిర్వహణ, వీధి దీపాలపై ఇన్‌ఛార్జి ఎఇలు పృథ్వీ, కామేష్, ఇన్‌ఛార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఉపేంద్రలతో మంగళవారం సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలకు, సంబరాలకు వచ్చే యాత్రికులకు తాగునీటి సమస్యల లేకుండా మోటార్లు అందుబాటులో ఉంచాలన్నారు. మరమ్మతులకు గురైన మోటారు, బోర్‌వెల్స్‌ను మరమ్మతులు చేపట్టాలన్నారు. ఊటబావిలను శుభ్రం చేయించి బ్లీచింగ్ వేయాలన్నారు. రాత్రి పూట ప్రజలకు ఇబ్బంది లేకుండా ఎల్ఇడి లైట్లను వేయాలన్నారు. వెలుగుతున్నవి, లేనివి నిరంతరం పర్యవేక్షించాలన్నారు. అవసరమైతే కొత్త ఎల్ఇడి లైట్లకు టెండర్లు పిలవాలన్నారు. ఎప్పటికప్పుడు పారిశుధ్య పనులు చేపట్టాలన్నారు.

ఇద్దరు ఉపాధ్యాయులకు షోకాజ్ నోటీసులు

టెక్కలి : మండలంలోని అక్కవరం ప్రాథమికోన్నత పాఠశాల్లో సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులుగా విధులు నిర్వహిస్తున్న పైల పుష్పలత, బంగారి అనసూయమ్మలకు డిఇఒ గార పగడాలమ్మ మంగళవారం షోకాజ్ నోటీసులు జారీ చేశారు. మంగళవారం పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల విధి నిర్వహణలో ఉపాధ్యాయులు అలసత్వం ప్రదర్శించడం, విద్యార్థుల ప్రగతి వర్క్‌బుక్స్ నిర్వహణ, హాజరు కావడంలో విధి నిర్వహణలో అలసత్వం ప్రదర్శించినట్లు తనిఖీలో గుర్తించారు. ఈ మేరకు వారికి షోకాజ్ నోటీస్‌లు జారీ చేసి వివరణ కోరారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఈశ్వరమ్మ, తదితరులు



లావేరు : పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న రమణ



ఇచ్ఛాపురం : పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

'ఉపాధి' రక్షణకు 5న చలో ఢిల్లీ

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

ఉపాధి హామీ చట్టం రక్షణకు వచ్చే నెల ఐదో తేదీన నిర్వహించనున్న చలో ఢిల్లీ కార్యక్రమానికి అధిక సంఖ్యలో కూలీలు పాల్గొని విజయవంతం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు గంగరాపు ఈశ్వరమ్మ అన్నారు. శ్రీకాకుళం మండలం ఖాజీపేటలో మంగళవారం పోస్టర్‌ను ఆవిష్కరించారు. పేదరిక నిర్మూలన, వలసల నివారణ, గ్రామీణ పేదల జీవన ప్రమాణాలు మెరుగు పరచడం లక్ష్యాలతో రూపొందించిన ఉపాధి హామీ చట్టాన్ని కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం నిర్వీర్యం చేయాలని చూస్తోందని విమర్శించారు. బడ్జెట్‌లో నిధుల కేటాయింపులను తగ్గించి కూలీలకు అన్యాయం చేయాలని చేస్తోందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పాటు పట్టణాలకూ వర్తింపచేయాలని ఆమె డిమాండ్ చేశారు. ఉపాధి హామీ పథకానికి బడ్జెట్‌లో రూ.2 లక్షల కోట్లు కేటాయించాలని, 200 రోజులు పనిదినాలు, రూ.600 కూలి చెల్లించాలని డిమాండ్ చేశారు.ఈ డిమాండ్ల సాధన కోసం ఛలో ఢిల్లీ నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు టి.తిరుపతిరావు, టి.పద్మ, టి.కృష్ణవేణి, సూర్యకుమారి, పి.లక్ష్మి, పి.పద్మ, అప్పన్న పాల్గొన్నారు.

లావేరు: కేంద్ర బిజెపి ప్రభుత్వ కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఏప్రిల్ 5 చలో ఢిల్లీను విజయవంతం చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్.వి.రమణ పిలుపునిచ్చారు లావేరులో చలో ఢిల్లీ పోస్టర్‌ను మంగళవారం ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్ర బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తూ కార్పొరేట్లకు ఊడిగం చేస్తుందన్నారు. కార్మికవర్గం తరతరాలుగా పోరాడి సాధించుకున్న చట్టాలను యజమానులకు అనుకూలంగా నాలుగు లేబర్ కోడ్‌గా మార్చి కార్మికులను కట్టు బానిసలుగా మార్చాలని చూస్తుందని అన్నారు. పెట్టుబడిదారులకు లక్షల కోట్ల రూపాయలు రాయితీలు ఇచ్చి... పేదలపై భారాలు మోపి ప్రజానీకాన్ని ఇబ్బందులు పాలు చేస్తున్నారని విమర్శించారు. రైతాంగానికి గిట్టుబాటు ధరలు కల్పించాలని, విద్యుత్ సంస్కరణ చట్టం-2022 రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు నిర్ణయించాలన్నారు. అటవీ హక్కుల చట్టం పగడ్బందీగా అమలు చేయాలన్నారు. కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్, డైలీ వేజ్ స్కీం వర్కర్లు, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు బి.ఉత్తర, ఎం.గౌరీశంకర్, ఎం.చక్రధర్, ఎస్.లక్ష్మి, కె.సుర్యకుమారి, కె.దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : కేంద్ర ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా చేపట్టుతున్న చలో ఢిల్లీని విజయవంతం చేయాలని అంగన్వాడీ జిల్లా అధ్యక్షులు ఎం.విజయలక్ష్మి పిలుపునిచ్చారు. పట్టణంలో ఆటో యూనియన్ స్టాండ్ వద్ద చలో ఢిల్లీ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సిఐటియు మండల కన్వీనర్ రమేష పట్నాయక్, భవన నిర్మాణా కార్మికుల సంఘం ప్రతినిధి రంగాల శ్రీను, ఆటో యూనియన్ ప్రతినిధి ఎర్రయ్య పాల్గొన్నారు.

మౌలిక వసతులు కల్పించాలని వినతి



వినతిపత్రం అందజేస్తున్న సిర్ల ప్రసాద్

ప్రజాశక్తి- కొత్తూరు

కొత్తూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల రహదారిలో ఉన్న బాలుర సాంఘిక సంక్షేమ వసతిగృహంలో కనీస వసతులు కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు సిర్ల ప్రసాద్ డిమాండ్ చేశారు. మంగళవారం ఎమ్మెల్యే వసతిగృహాన్ని సందర్శించారు. ఈ మేరకు ఆమెను కలిసి వినతిపత్రం అందజేశారు. కాలువలు సక్రమంగా లేకపోవడంతో ఐదు రోజులుగా కురుస్తున్న వర్షాలకు వసతిగృహంలో మురుగునీరు చేరుతుందని, దీంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని ఆమె దృష్టికి తీసుకెళ్లారు. శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. ప్రధాన రహదారిలో ఉన్న కల్వర్టును పూడ్చివేశారని, అందులోని చెత్తా చెదారాలను తొలగించేందుకు చర్యలు చేపట్టాలని అన్నారు. బాలురు, బాలికల వసతిగృహాలు శిథిలావస్థకు చేరుకున్నాయని, నిధులు మంజూరు చేయించి నూతన భవనాల నిర్మాణాలకు చర్యలు చేపట్టాలని అన్నారు. అలికాం-బత్తిలి రహదారిపై మురుగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమస్యలపై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. అనంతరం ఎమ్మెల్యే నూతన భవనానికి తరలించిన విద్యార్థుల వద్దకు వెళ్లి పలకరించారు. ధైర్యంగా ఉండాలని సూచించారు. అనంతరం పదో తరగతి విద్యార్థులకు పరీక్షా సామగ్రిని అందజేశారు. ఈమె వెంట ఎంఇఒ బి.శ్రీధర్, వార్డెన్ ఉమాశంకరరావు, వైసిపి మండల అధ్యక్షులు సారిపల్లి ప్రసాదరావు, పిఎసిఎస్ అధ్యక్షులు చింతాడ సూర్యనారాయణ, ఎంపిటిసి ప్రతినిధి జి.ఆనందరావు, సర్పంచ్ ప్రతినిధి మొజ్జాడ చక్రపాణి, వైసిపి నాయకులు లోతుగెడ్డ తిరుపతిరావు, బి.శ్రీను, చుక్క రాంబాబు ఉన్నారు.

విరాళాల సేకరణ

ప్రజాశక్తి- పలాస

త్రిపురలో ప్రతి పక్ష నాయకులపై, ఆస్తులపై బిజెపి, ఆర్ఆర్ఎస్ నాయకులు దాడి చేయడం అమానుషమని సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్.గణపతి తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. త్రిపుర ప్రతి పక్షాలకు అండగా ఉండాలనే ఉద్దేశంతో సిఐటియు, ఎల్ఐసి సంఘాల ఆధ్వర్యాన రూ.1710లు మంగళవారం విరాళాలు సేకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ విరాళాలను త్రిపుర రాష్ట్రానికి పంపిస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఎల్ఐసి ఉద్యోగుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు పి.రాంబాబు, ఎన్.సుబ్బారావు, సిఐటియు మండల కన్వీనర్ ఎం.లావణ్య, ఐద్వా నాయకులు జె.భాగ్యలక్ష్మి, పద్మ పాల్గొన్నారు.



విరాళాలను సేకరిస్తున్న నాయకులు

వసతిగృహ విద్యార్థుల తరలింపు



విద్యార్థులను తరలించిన భవనం

ప్రజాశక్తి- కొత్తూరు

స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల సమీపంలో ఉన్న సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహం విద్యార్థులను ఎట్టకేలకు మంగళవారం తరలించారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో రూ.2 కోట్లతో నూతనంగా నిర్మించిన భవనంలోకి వార్డెన్ ఉమాశంకరరావు విద్యార్థులను తీసుకెళ్లారు. వసతిగృహం చుట్టూ ఉన్న కాలువలు మూసుకుపోవడంతో కొన్నాళ్లుగా చిన్న పాటి వర్షానికే మురుగునీటితో నీరు చేరుతుంది. ఇటీవల అప్పపీడన ద్రోణితో కురిసిన వర్షాలకు వసతిగృహంలోకి నీరు చేరడంతో అందులోని పుస్తకాలు, దుస్తులు, వంట సామగ్రి తడిచిపోయాయి. దీంతో విద్యార్థులు అవస్థలు పడ్డాడు. వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యాన ఇటీవల విద్యార్థులు ఆందోళన చేపట్టారు. అప్పుడు సమాచారం అందుకున్న టెక్కలి సబ్ కలెక్టర్ రాహుల్ కుమార్‌రెడ్డి వసతిగృహాన్ని సందర్శించారు. సమస్యను గుర్తించి తక్షణమే పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. ఆర్అండ్‌బి కల్వరు నుంచి కాలువలో పేరుకుపోయిన చెత్తా చెదారాలను తొలగించాలని సూచించారు. అయినా సమస్య పరిష్కారం కాలేదు. మళ్లీ సోమవారం రాత్రి కురిసిన వర్షానికి నీరు చేరడంతో విద్యార్థులు నిద్రలేకుండా గడిపారు. దీంతో చేసేది ఏమీ లేక ఉన్నతాధికారులను వార్డెన్ సంప్రదించి విద్యార్థులను తరలించారు.

మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు

ప్రజాశక్తి- నందిగాం

గ్రామాల్లో పూర్తిస్థాయి మౌలిక సదుపాయాలు కల్పనకు ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి చర్యలు తీసుకుంటున్నారని కళింగ కార్పొరేషన్ చైర్మన్ పేరాడ తిలక్ అన్నారు. మండలంలోని సైలాడ పంచాయతీ దొడ్లరామచంద్రపురంలో ఇంటింటికీ తాగునీటి సదుపాయాలు కల్పన పనులకు ఎంపిపి నడుపూరు శ్రీరామ్మూర్తితో కలిసి మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా తిలక్ మాట్లాడుతూ అన్ని గ్రామాల్లో తాగునీటి సౌకర్యం కల్పిస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ప్రతినిధి శంబాన దానయ్య, ఎంపిటిసి పిన్నింటి జయరాం, వైస్ ఎంపిపి రొనగల కూర్మారావు, మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితులు చిన్ని జోగారావు యాదవ్, సర్పంచ్‌లు బొమ్మాళి గున్నయ్య, తమిరి రాజు, కవిటి ఎర్రన్న, బొంగి హనుమంతరావు, బోరుభద్ర సోమేశ్వరరావు, కొంచాడ తాతయ్య, కురమాన ఉత్తంకుమార్, కొంచాడ అజయ్, శంబాన భాస్కరరావు పాల్గొన్నారు.



శంకుస్థాపన చేస్తున్న తిలక్

దాడికి పాల్పడిన వారిని అరెస్టు చేయాలి

టెక్కలి : నరసన్నపేట మండలం సుందరాపు రానికి చెందిన దళితుడు నీలకంఠంపై దాడి చేసిన వ్యక్తులను తక్షణమే అరెస్టు చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని దళిత హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షులు యడ్ల గోపి ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. స్త్రీనిధి డబ్బులు వసూళ్లపై ప్రశ్నించినందుకు అగ్రకుల తరగతికి చెందిన వారు దాడి చేసి కులం పేరుతో దూషించడం అమానుషమన్నారు. ఈ విషయమై ఫిర్యాదు చేసినా అధికారులు స్పందించకపోవడం అన్యాయమని ఆవేదన వ్యక్తంచేశారు. ఈ ఘటనపై జిల్లా అధికారులు దృష్టి సారించి బాధితుని ఫిర్యాదు మేరకు చర్యలు తీసుకోవాలని కోరారు.



ధర్నా చేస్తున్న జనసేన నాయకులు

ప్రజా సమస్యలు పట్టవా?

ప్రజాశక్తి- ఆమదాలవలస

వైసిపి నాయకులకు అధికార దాహమే తప్ప ప్రజా సమస్యలు పట్టడం లేదని జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి పేడాడ రామ్మోహనరావు అన్నారు. మండలంలోని కొత్త రోడ్డు వద్ద జనసేన పార్టీ నాయకులు పాడైన గుంతల రోడ్డుపై మంగళవారం ధర్నా చేపట్టారు. అనంతరం మానవహారం చేపట్టి నిరసనను వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆమదాలవలస నుంచి శ్రీకాకుళం రోడ్డు పరమ అధ్వానంగా తయారైందన్నారు. శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం ఒకవైపు ప్రాతినిధ్యం వహిస్తూ... మరోవైపు రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు ప్రాతినిధ్యం వహిస్తున్నారని అన్నారు.

కానీ, ప్రజల ముఖ్యమైన సమస్య రోడ్డు నిర్మాణాన్ని పట్టించుకోవడంలేదని ధ్వజమెత్తారు. వారం రోజుల్లో రహదారి పనులను ప్రారంభించకపోతే ప్రజలు, జన సైనికులతో కలిసి ఆమరణ నిరాహార దీక్ష చేపడతామని ప్రభుత్వానికి హెచ్చరించారు. కార్యక్రమంలో జనసేన నాయకులు పైడి మురళీమోహన్, గణేష్, కోటేష్, ధనుంజయరావు, బాలకృష్ణ, యశ్వంత్, తవిటినాయుడు, రాధాకృష్ణ, శ్రీధర్, నాయుడు పాల్గొన్నారు.



జి.సిగడాం : సమస్యలను వివరిస్తున్న అప్పలనాయుడు

ప్రజల చెంతకు పథకాలు

జి.సిగడాం : మండలంలోని మదుపాంలో ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ మేరకు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ముద్రించిన పోస్టర్లను అందజేశారు. ఈ మేరకు పలు సమస్యలను సర్పంచ్ భోగాది అప్పలనాయుడు ఎమ్మెల్యేకు వివరించారు. త్వరలోనే సమస్యలను పరిష్కరిస్తానని హామీనిచ్చారు. కార్యక్రమంలో ఎంపిపి మీసాల సత్యవతి, జెడ్‌పిటిసి కాయల రమణ, ఎంపిపి ప్రతినిధి వెంకటరమణ, వైసిపి మండల అధ్యక్షులు బూరాడు వెంకటరమణ బాతువ పిఎసిఎస్ అధ్యక్షులు పల్లాడ సన్యాసిరావు, ఎంపిడిఒ శ్రీనివాసరావు, తహశీల్దార్ పప్పల వేణుగోపాలరావు పాల్గొన్నారు.

సంతబొమ్మాళి : సంక్షేమ పథకాలు ప్రజలు చెంతకు అందించిన ఘనత ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి అందిస్తున్నారని ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ అన్నారు. మండలంలోని పాలతలగాంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ముద్రించి పోస్టర్లను అందజేశారు. కార్యక్రమంలో టెక్కలి జెడ్‌పిటిసి దువ్వాడ వాణి, పిఎసిఎస్ చైర్మన్ కెల్లి జగన్నాయకులు, వైస్ ఎంపిపి ప్రతినిధి నక్క భీమరావు, సర్పంచ్ నక్కెట్ల అప్పన్న, ఎంపిటిసి ప్రతినిధి అట్టాడ అప్పలనాయుడు, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షులు శ్రీరాంగం వీరస్వామి, కార్యదర్శి కె.రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.



కోటబొమ్మాళి : పోస్టర్‌ను అందజేస్తున్న ఎమ్మెల్సీ శ్రీనివాస్

నర్సిపురం వంతెనను తెరిపించాలి

ప్రజాశక్తి- పలాస

పలాస రైల్వే స్టేషన్‌లో అవతలి వైపు ఉన్న నర్సిపురం వంతెన తెరిపించాలని రైల్వే అభివృద్ధి కమిటీ సభ్యులు డిమాండ్ చేశారు. రైల్వే స్టేషన్లో వసతి గృహంలో మంగళవారం రైల్వే అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఖుర్దా డివిజన్ ఈస్ట్‌కోస్ట్ రైల్వే అసిస్టెంట్ మేనేజర్ మనోజ్‌భారత్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైల్వే అభివృద్ధి కమిటీ సభ్యులు మాట్లాడుతూ చాలా ఏళ్ల నుంచి నర్సిపురం వంతెన నుంచే ఆ ప్రాంత వాసులు రాకపోకలు చేస్తున్నారని, ఇటీవల వంతెన శిథిలావస్థకు చేరుకుందని ఉద్దేశంతో వంతెన మూసివేశారని అన్నారు. అయితే కేవలం రాకపోకలకు వీలుగా వంతెన తెరిపించాలని కోరారు. రైల్వే స్టేషన్ సమీపంలో ఎటిఎం కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. అనంతరం పలు రైళ్లకు పలాస హాల్ట్ కల్పించాలని కోరారు. దీనిపై మనోజ్ భరత్ మాట్లాడుతూ నర్సిపురం వంతెన విషయాన్ని డిఆర్ఎం దృష్టికి తీసుకెళ్లి వంతెన మార్గాన్ని తెరిపించే విధంగా చర్యలు చేపడతానని హామీ ఇచ్చారు. పలాస రైల్వే సమస్యలను ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారమయ్యే విధంగా చర్యలు చేపడతానని చెప్పారు. అనంతరం ఆయనకు వివిధ సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని రైల్వే అభివృద్ధి కమిటీ సభ్యులు అందజేశారు. కార్యక్రమంలో రైల్వే స్టేషన్ మేనేజర్ సామన కుమార్ దాస్, అభివృద్ధి కమిటీ సభ్యులు డబ్బీర్ భవానీశంకర్, మీసాల సురేష్‌బాబు, పి.వి.సతీష్, ఎన్.విశ్వేశ్వ రావు, రేవతి శ్రీనివాస్, జి.శ్రీనివాస్ పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న అభివృద్ధి కమిటీ సభ్యులు

నియోజకవర్గాల బిజెపి

కన్వీనర్ల నియామకం



ఈశ్వరరావు



నిర్మలారెడ్డి

రణస్థలం రూరల్: ఎచ్చెర్ల నియోజకవర్గ బిజెపి కన్వీనర్‌గా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నడుకుదిటి ఈశ్వరరావు నియమి తులయ్యారు. ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు సోము వీర్రాజు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈశ్వరరావు 2019లో బిజెపిలో చేశారు.

ఇచ్ఛాపురం : ఇచ్ఛాపురం నియోజకవర్గ బిజెపి కన్వీనర్‌గా బుద్దాల నిర్మలారెడ్డిని నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు ఉత్తర్వులు జారీ చేశారు. రెడ్డి సామాజిక తరగతికి చెందిన నిర్మలారెడ్డి భర్త కీర్తిశేషులు త్రినాథ్‌రెడ్డి జిల్లా పరిషత్ చైర్మన్‌గా బాధ్యతలు నిర్వహించారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

ప్రజాశక్తి- జలుమూరు

ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారంతోనే గర్భిణులకు, బాలింతలకు సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతోందని ఐసిడిఎస్ సూపర్‌వైజర్ డి.సుజాత అన్నారు. జలుమూరు-1 అంగన్వాడీ కేంద్రంలో పోషణ్ పఖ్వాడా కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తమ మెనూలో చిరుధాన్యాలు వంటలు ఉండేలా చూసుకోవాలన్నారు. ప్రభుత్వం అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న చిరుధాన్యాలతో తయారు చేసిన తినుబండారాలను అందజేశారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ లలితాంబ, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.


పొందూరు: ఆరోగ్యవంతమైన జీవనం కోసం పోషక విలువలతో కూడిన ఆహారం తీసుకోవడం అవసరమని ఐసిడిఎస్ గోరింట సెక్టర్ శాఖ సూపర్‌వైజర్ తమ్మినేని లక్ష్మి అన్నారు. మండలంలోని తాడివలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం పోషణ్ పఖ్వాడ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. చిరుధాన్యాలైన కొర్రలు, అండుకొర్రలు, అరికలు, ఊదలు, సామలు, తృణ ధాన్యాలైన రాగులు, జొన్నలు, సజ్జలుపై అవగాహన కల్పించారు. పాఠశాల లో గోరింట సెక్టర్ పరిధిలోని అంగన్వాడీ టీచర్లు ఏర్పాటు చేసిన చిరుధాన్యాల ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు లఖినాన హేమనాచార్యులు, సచివాలయం మహిళా కానిస్టేబుల్ మహేశ్వరి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



జలుమూరు : మాట్లాడుతున్న సూపర్‌వైజర్ సుజాత

కవిటి: పోషకాహారంతో మెరుగైన ఆరోగ్యం లభిస్తుందని జగతి సర్పంచ్ పూడి ప్రసాదరావు అన్నారు. పోషక పఖ్వాడ వారోత్సవాల్లో భాగంగా జగతి పంచాయతీ బట్టివానిపాలెంలో గర్భిణులకు, బాలింతలకు, చిన్నారులకు పోషకాహారంపై అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్వాడీ సూపర్‌వైజర్ బి.సుజాత, సిబ్బంది పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికారాన్ని గర్భిణులు, బాలింతలు, బాలికలు సక్రమంగా సద్వినియోగం చేసుకోవాలని వార్డు కౌన్సిలర్ కాళ్ల దిలీప్ కుమార్ అన్నారు. పట్టణంలో 21, 22 వార్డుల్లోని అంగన్వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. కార్యక్రమంలో కౌన్సెలర్ ప్రతినిధి కాళ్ల జయదేవ్, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ జ్యోతిలక్ష్మి, అంగన్వాడీ కార్యకర్త జయ, కోమలి, ఉమా, సురేఖ, ఫాతిమా, జ్యోతి, దిల్లేశ్వరి, మహిళా పోలీసు సుమిత్ర పాల్గొన్నారు.



తాడివలసలో ఆహార పదార్థాలను ప్రదర్శిస్తున్న కార్యకర్తలు

టెక్కలి : మండలంలోని తలగాం ఎట్ నౌపడ ఆర్ఎస్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో చదువుతున్న విద్యార్థుకు బిగ్‌హెల్ప్ అసోసియేషన్ పౌష్టికాహారాన్ని పంపిణీ చేసిందని డైరెక్టర్ రామముని రమేష్ కుమార్ తెలిపారు. విద్యార్థుల్లో పోషకాహారం లోపం నివారించాలనే ఉద్దేశంతో పంపిణీ చేశామని అన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎ.ధర్మారావు, అసోసియేషన్ చైర్మన్ ఎన్.కృష్ణారావు పాల్గొన్నారు.


వైద్య విద్యార్థుల కొట్లాట!

శ్రీకాకుళం ప్రతినిధి: రిమ్స్ మెడికల్ కళాశాలలో ఇద్దరు వైద్య విద్యార్థులు కొట్టుకున్న ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. కళాశాలలో ఈ నెల 25న జరిగిన ఓ వేడుకలో తలెత్తిన వివాదం చినికిచినికి కొట్టుకునే స్థాయికి వెళ్లింది. కళాశాలలో ఖమ్మంకు చెందిన ప్రథమ సంవత్సరం చదువుతున్న ఓ విద్యార్థి, నాలుగో సంవత్సరం చదువుతున్న విశాఖకు చెందిన ఓ విద్యార్థికి మధ్య వేడుక నిర్వహణలో పరస్పరం కామెంట్లు చేసుకున్నట్లు తెలిసింది. ఈ నెల 27న మరోసారి గొడవ పడటంతో జూనియర్ విద్యార్థిని నాలుగురు విద్యార్థులతో కలిసి సీనియర్ విద్యార్థిని కొట్టి ఓ గదిలో బంధించినట్లు తోటి విద్యార్థులు చెప్తున్నారు. సమాచారం అందుకున్న ప్రిన్సిపాల్ ఆర్.వెంకటాచలం గదిలో ఉన్న జూనియర్ విద్యార్థిని విడిపించారు. ఇరువురినీ పిలిచి చివాట్లు పెట్టినట్లు తెలిసింది. చేతికి, కాలుకి గాయాలు కావడంతో ఆస్పత్రిలో చికిత్స కోసం చేయించారు. మరోపక్క సీనియర్ విద్యార్థి తల్లిదండ్రులకు విషయం వివరించి సస్పెండ్ చేస్తామని హెచ్చరించారు. జూనియర్ విద్యార్థికి చెందిన తల్లిదండ్రులకు కళాశాలకు రావాలని సూచించారు. సీనియర్ విద్యార్థి కొట్టిన అంశంపై తనకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు ఇవ్వాలని జూనియర్‌కు సూచించారు. సీనియర్ విద్యార్థి భవిష్యత్‌కు నష్టం వస్తుందనే ఉద్దేశం ఫిర్యాదు ఇవ్వడానికి జూనియర్ నిరాకరించినట్లు తెలిసింది. కళాశాలకు బుధవారం జూనియర్ విద్యార్థి తల్లిదండ్రులు వచ్చే అవకాశం ఉన్నందున వారిని నిర్ణయాన్ని బట్టి తదుపరి చర్యలు తీసుకుంటామని ప్రిన్సిపాల్ తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

కవిటి: మండలంలోని జాడుపూడి-కొజ్జిరియా గ్రామాల మధ్య రైలు ఢీకొని 45 - 50 సంవత్సరాల వయసు గల వ్యక్తి మంగళవారం మృతి చెందారు. స్థానికుల సమాచారం మేరకు జిఆర్‌పి పోలీసులు మృతదేహాన్ని పలాస ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతదేహంపై గడుల చొక్కా, లుంగీ ఉన్నాయని, సంబంధిత వ్యక్తులు తమను సంప్రదించాలని జిఆర్‌పి ఎస్ఐ షరీఫ్ తెలిపారు. దీనిపై కేసు దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

ఎలుగు హల్‌చల్



సంచరిస్తున్న ఎలుగు

వజ్రపుకొత్తూరు : ఉద్దానం రైతులకు ఎలుగు భయం వీడడం లేదు. గతేడాది కిడిసింగి, వజ్రపుకొత్తూరుల్లో ఎలుగు దాడిలో ముగ్గురు మృత్యువాత పడ్డారు. తాజాగా మంగళవారం సాయంత్రం అక్కుపల్లి, గరుడభద్ర మధ్యలో అమ్మవారి ఆలయాల సమీపంలో ఎలుగు సంచరిస్తూ కనిపించింది. దీంతో స్థానికులు హడలిపోయారు. ప్రస్తుతం జీడి తోటల్లో పిక్కలు సేకరించే పనుల్లో రైతులు బిజీగా ఉన్నారు. జీడి తోటల్లో ఎలుగు కనిపించడంతో రైతులు ప్రాణ భయంతో ఇళ్లకు పరుగులు తీశారు. పిక్కలు సేకరించడానికి తోటలకు వెళ్లాలంటేనే భయాందోళన చెందుతున్నారు. గతేడాది అనుభవం దృష్ట్యా అటవీశాఖ అధికారులు స్పందించి ఎలుగు బంధించి జూ కి తరలించడానికి చర్యలు తీసుకోవాలని ఉద్దానం రైతులు కోరుతున్నారు.



ట్యాబ్‌ను పరిశీలిస్తున్న డిఇఒ పగడాలమ్మ

శతశాతం ఉత్తీర్ణత సాధించాలి

టెక్కలి రూరల్ : పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో శతశాతం ఉత్తీర్ణత సాధించాలని డిఇఒ జి.పగడాలమ్మ అన్నారు. మండలంలోని లింగాలవలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను మంగళవారం సందర్శించారు. ఈ మేరకు పరీక్షలపై అవగాహన కల్పించారు. ఉపాధ్యాయులకు, విద్యార్థులకు ఏ విధంగా తర్ఫీదు ఇస్తే శతశాతం ఫలితాలు సాధించవచ్చు అనే విషయంపై పలు సూచనలు చేశారు. ఎనిమిదో తరగతి విద్యార్థులకు ఇచ్చిన బైజ్యూస్ ట్యాబ్‌లను పరిశీలించారు. మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తపరిచారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఎం.అనురాధ, ఉపాధ్యాయులు సింహాచలం, సూర్యప్రకాష్, శైలజ సుభాషిని, నాగేశ్వరరావు, శ్రీనివాసరావు, పాపారావు, ఇందుమతి, నారాయణరావు పాల్గొన్నారు.



ప్రశంసాపత్రాలను చూపిస్తున్న విద్యార్థులు

'విజ్ఞాన్' విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి- నరసన్నపేట

భగవద్గీత వ్యాల్యూస్ ఒలంపియాడ్ కాంపిటేషన్ ఇస్కాన్ హైదరాబాద్ ఆధ్వర్యాన రాధాకృష్ణ ఆధ్యాత్మిక కేంద్రం మంగళవారం నిర్వహించిన పోటీల్లో నియోజకవర్గస్థాయిలో విజ్ఞాన్ విద్యా నికేతన్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ సాధించారని డైరెక్టర్ రవి మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా అప్పర్ క్యాటగిరిలో మొదటి విజేతగా మూకళ్ల చరిష్మా రూ.5 వేలు విలువైన స్మార్ట్ వాచీ, ఇంటర్నేషనల్ ధ్రువపత్రం పొందిందని అన్నారు. లోవర్ కేటగిరిలో మూకళ్ల గీతామాధురి మొదటి విజేతగా రూ.850 విలువ చేసిన పెన్‌డ్రైవ్, ఇంటర్నేషనల్ ధ్రువపత్రం గెలుపొందిందని అన్నారు. ద్వితీయ స్థానంలో ఇప్పిలి కృష్ణ వైశాలి నంద, దండుపాటి నితీష్‌లు గెలుపొందారని తెలిపారు. తృతీయ స్థానంలో బి.రితీష్, పి.గణేష్‌లకు కృష్ణ బుక్, ఇంటర్నేషనల్ ధ్రువపత్రం అందుకున్నారని అన్నారు. విజేతలకు విజ్ఞాన్ విద్యానికేతన్ యాజమాన్యం, ఉపాధ్యాయులు అభినందించారు.

నేడు భూ సమస్యలపై 'స్పందన'

పలాస : పలాస మున్సిపల్ కార్యాలయంలో బుధవారం ఉదయం 10 గంటలకు నియోజక వర్గంలో నెలకొన్న భూ సమస్యలపై స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మత్స్య, పశుసంవర్ధకశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ స్పందన కార్యక్రమంలో కలెక్టర్, పలాస ఆర్‌డిఒ, పలాస, వజ్రపుకొత్తూరు, మందస మండలాల తహాశీల్దార్లు హాజరు అవుతున్నట్లు తెలిపారు.


అవగాహన కల్పిస్తున్న వెంకటరావు

మత్తు పదార్థాల రవాణాపై నిఘా

ప్రజాశక్తి- ఆమదాలవలస

గంజాయి, ఇతర మత్తు పదార్థాలు రైళ్లలో అక్రమ రవాణాపై నిఘా పెట్టి అరికట్టాలని విశాఖపట్నం లైన్స్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కె.వెంకటరావు జిఆర్‌పి పోలీసులను ఆదేశించారు. శ్రీకాకుళం రోడ్డు రైల్వే స్టేషన్‌లోని జిఆర్‌పి పోలీస్ స్టేషన్‌ను మంగళవారం తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆవరణలో సమావేశం నిర్వహించి మాట్లాడారు. జిఆర్‌పి, ఆర్‌పిఎఫ్ పోలీసులు ఉమ్మడిగా కలిసి అక్రమ రవాణాను అరికట్టాలన్నారు. వేసవి కాలం సందర్భంగా ప్లాట్ ఫామ్ బిట్స్, ట్రైన్ బిట్స్‌లో సిబ్బందిని నియమించి నేరాలను అరికట్టాలని ఆదేశించారు. స్థానిక పోలీసులు, ఎస్‌బి, ఇంటెలిజెన్స్ సిబ్బందితో సత్సంబంధాలు కలిగి సమాచారాన్ని తెలుసుకోవాలన్నారు. రైల్వే స్టేషన్ స్టాల్స్‌లో పనిచేసే సిబ్బంది, కూలీల దగ్గర నుంచీ సమాచారాన్ని సేకరించాలన్నారు. మాదకద్రవ్యాలు, బంగారం తదితర అక్రమ రవాణాపై దృష్టి సారించి నిందితులను పట్టుకొని కేసులు నమోదు చేయాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో జిఆర్‌పి ఎస్‌ఐ శ్రీనివాసరావు, ఆర్‌పిఎఫ్ ఎస్‌ఐ నాయక్, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.


సజ్జల రామకృష్ణారెడ్డిని కలిసిన నాయకులు

బెంతు ఒరియాలకు న్యాయం చేయాలి

ప్రజాశక్తి- కవిటి

అనాధిగా వివక్షకు గురవుతున్న బెంతు ఒరియాలకు న్యాయం చేయాలని బెంతుఒరియా యువజన సంఘం ప్రతినిధి, బెంతు ఒరియా జిల్లా మాజీ అధ్యక్షుడు రజనీకుమార్ దొళాయి కోరారు. సీడాప్ చైర్మన్ సాడి శ్యామ్ ప్రసాద్‌రెడ్డి చొరవతో అమరావతిలో ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డిని మంగళవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బెంతు ఒరియాల సమస్యలు వివరించారు. బెంతు ఒరియాలకు ఎస్‌టి ధ్రువపత్రాలను పునరుద్ధరణకు ఆదేశాలు జారీ చేయాలని కోరారు. విద్యాదీవెన అందక విద్యార్థులు అవస్థలు పడుతున్నారని తెలియజేశారు. దీనిపై స్పందించిన సజ్జల సమస్య పరిష్కారానికి ప్రభుత్వం సానుకూలంగా ఉందని, ఈ అంశానికి సంబంధించి ఇంకొన్ని వివరాలు ముఖ్యమంత్రికి అందిన వెంటనే తుది నిర్ణయం తీసుకుంటారని తెలిపారు. కార్యక్రమంలో బెంతుఒరియా యువజన సంఘం అధ్యక్షుడు సుమన్ బిసాయి, కార్యదర్శి దుదిష్టి మజ్జి, జగన్ బిసాయి తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై శిక్షణ

ప్రజాశక్తి- ఆమదాలవలస

మండల పరిధిలోని స్వయంశక్తి సంఘాల్లో సభ్యులుగా ఉండి వైఎస్ఆర్ ఆసరా, చేయూత లబ్ధిదారులకు ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పించాలని వైఎస్ఆర్ క్రాంతి పథం అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ పైడి కూర్మారావు తన సిబ్బందికి సూచించారు. పట్టణంలోని స్థానిక మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో మండల మహిళా అధ్యక్షులు తమ్మినేని ధనలక్ష్మి అధ్యక్షతన మంగళవారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సభ్యులందరికీ ఫైనాన్షియల్ లిటరసీపై అవగాహన కల్పిస్తూ, సంఘం వారీగా, సభ్యులు వారీగా ఖాతాలకు ఆసరా నిధులను జమ చేస్తూ... క్షుణ్ణంగా అర్థమయ్యేటట్లు వివరించాలని తెలిపారు. ఎట్టి పరిస్థితుల్లోనూ నగదు లావాదేవీలు జరపరాదని సూచించారు. ప్రతి లావాదేవీను తీర్మానం పుస్తకంలో పొందుపరిచి సభ్యులందరి ఆమోదం పొంది సంతకాలు చేసిన తరువాత మాత్రమే బ్యాంకులకు అప్రోచ్ అవ్వాలని తెలిపారు. కార్యక్రమంలో మండల సమాఖ్య అకౌంటెంట్ కళ్యాణి, క్లస్టర్ కో-ఆర్డినేటర్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్ జగదీష్ పాల్గొన్నారు.

పంచాయతీ అభివృద్ధికి కృషి

ఇచ్ఛాపురం : మండలంలోని ఈదుపురం పంచాయతీ అభివృద్ధికి కృషి చేస్తున్నామని సర్పంచ్ నర్తు ప్రేమ్‌కుమార్ యాదవ్ అన్నారు. వేణుగోపాల కాలనీ రెండో లైన్‌లో 14వ ఆర్థిక సంఘం నిధులతో సిసి రోడ్డు నిర్మాణ పనులకు మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.25 లక్షలు వెచ్చించి పెండింగ్‌లో ఉన్న రోడ్లు, కాలువల పనులు జూన్ నాటికి పూర్తి చేసేందుకు ప్రణాళికలు రూపొందించామన్నారు. మోడల్ పంచాయతీగా అభివృద్ధి చేస్తానని హామీనిచ్చారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి దువ్వు వివేకానంద రెడ్డి, ఎంపిటిసి మాజీ సభ్యులు దుక్క నీలాద్రిరెడ్డి, వార్డు సభ్యులు ఉప్పాడ నాగమ్మ, దువ్వు పురుషోతం, బి.మోహనరావు, తిరుపతి పాల్గొన్నారు.


పరీక్ష సామగ్రిని అందజేస్తున్న మల్లికార్జునరావు

పరీక్షా సామగ్రి పంపిణీ

ఆమదాలవలస : పట్టణంలోని లక్ష్మీనగర్ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో పది పబ్లిక్ పరీక్షలు రాసే విద్యార్థులకు వ్యాపారవేత్త శిల్లా మల్లికార్జునరావు అట్టలు, పెన్నులు, పెన్సిళ్లు కిట్లను మంగళవారం ఉచితంగా అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులకు తొలిమెట్టు పదో తరగతి అని అన్నారు. విద్యలో రాణించి అటు తల్లిదండ్రులకు, ఇటు ఉపాధ్యాయులకు మంచి పేరును తీసుకురావాలని ఆకాంక్షించారు. అనంతరం విద్యార్థులకు హాల్ టికెట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్.రవణమ్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డ్వాక్రా సంఘాల అభివృద్ధికి కృషి

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

డ్వాక్రా మహిళా సంఘాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ, ఎమ్మెల్సీ నర్తు రామారావు అన్నారు. స్థానిక మండల రెవెన్యూ కార్యాలయం ఆవరణలో మంగళవారం ఆసరా నమూనా చెక్కును అందజేశారు. అనంతరం పొదుపు సంఘాల సభ్యులతో కలిసి సిఎం జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో రెడ్డిక కార్పొరేషన్ చైర్మన్ దుక్క లోకేశ్వరరెడ్డి, ఎంపిపి బోర పుష్ప, జెడ్‌పిటిసి ఉప్పాడ నారాయణమ్మ, పిఎసిఎస్ అధ్యక్షులు నర్తు నరేంద్ర యాదవ్, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్లు ఉలాల భారతి దివ్య, లాభాల స్వర్ణమణి, దువ్వు వివేకానంద, యలమంచి నీలయ్య, కారంగి మోహనరావు, దక్కత నూకయ్యరెడ్డి, పిట్ట మామయ్య, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.


ఇచ్ఛాపురం : నమూనా చెక్కును అందజేస్తున్న విజయ, రామారావు

కోటబొమ్మాళి: మండలంలోని కొత్తపల్లి సచివాలయంలో డ్వాక్రా సంఘాల సభ్యులకు జెడ్‌పిటిసి దుబ్బ వెంకటరావు ఆసరా నమూనా చెక్కును అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ బొమ్మాళి ఇందిరమ్మ, ఎంపిటిసి ప్రతినిధి పంకు రాము, వెలుగు సిసిలు పాల్గొన్నారు.

ఆమదాలవలస : మండలంలోని జొన్నవలస, రామచంద్రపురం, కొర్లకోట, అక్కివరం సచివాలయ పరిధిలో నాయకులు, డ్వాక్రా సంఘాల మహిళలు సిఎం జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు.

వజ్రపుకొత్తూరు : మండలంలోని బెండిలో జిల్లా ప్రణాళిక సంఘం మాజీ అధ్యక్షులు హనుమంతు వెంకటరావుదొర అధ్యక్షతన ఆసరా సంబరాలు నిర్వహించారు. మండలంలోని గ్రూపులకు రూ.2,01,83,796 నిధులు విడుదలైనట్లు వెలుగు ఎపిఎం కోడూరు జాంబవతి తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి తమ్మినేని శ్రావణి, వైస్ ఎంపిపి ప్రతినిధి తమ్మినేని శాంతారావు, ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.


కోటబొమ్మాళి : నమూనా చెక్కును అందజేస్తున్న జెడ్‌పిటిసి వెంకటరావు

నందిగాం: ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డితోనే మహిళా సంక్షేమం సాధ్యమని కళింగ కార్పొరేషన్ చైర్మన్ పేరాడ తిలక్, ఎంపిపి నడుపూరు శ్రీరామ్మూర్తి అన్నారు. మండలంలోని సైలాడ పంచాయతీ దొడ్ల రామచంద్రపురంలో డ్వాక్రా మహిళా సంఘాల ఆధ్వర్యాన సిఎం జగన్ చిత్రపటానికి మంగళవారం పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని లక్ష్యంతో అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ శంబాన దానయ్య, ఎంపిటిసి పిన్నింటి జయరాం, వైస్ ఎంపిపి రొనగల కూర్మారావు, మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితులు చిన్ని జోగారావు యాదవ్ పాల్గొన్నారు.


ఆమదాలవలస : సిఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న మహిళలు

సమగ్ర యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడి

కెవికె ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ భాగ్యలక్ష్మి

ఆమదాలవలస : సమగ్ర యాజమాన్య పద్ధతులతో పంటల్లో అధిక దిగుబడిని సాధించవచ్చని కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ డాక్టర్ కె. భాగ్యలక్ష్మి అన్నారు. మండలంలోని నిమ్మతొర్లాడలో శాస్త్రవేత్తలతో కలిసి చెరుకు, నువ్వుల పంటలను మంగళవారం పరిశీలించారు. అధిక దిగుబడినిచ్చే నువ్వు వైఎల్ఎం 66 రకంపై క్షేత్ర దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చెరకులో కొరడా తెగులు ఉందని, దానిని గమనించి నివారణకు లీటర్ నీటికి ప్రాఫికోనజోల్ ఒక మిల్లీ లీటరు, టెబుకొనజోల్ ఒక మిల్లీమీటర్ చొప్పున 200 లీటర్ల మందు ద్రావణాన్ని చేను మొత్తం తడిసేలా కార్సి చేసిన వెంటనే 30-35 రోజులకు ఒకసారి పిచికారీ చేయాలని తెలియజేశారు. నువ్వుల మొక్కలు ఎండు తెగులు వచ్చి చచ్చిపోయినట్లయితే లీటర్ నీటికి మూడు గ్రాముల సాఫ్ గాని కాప్రాక్సీ క్లోరైడ్ చొప్పున కలిపి 200 లీటర్ల మందు ద్రావణాన్ని కలిపి పిచికారీ చేయాలని తెలిపారు. కార్యక్రమంలో విస్తరణ శాస్త్రవేత్త డాక్టర్ ఎస్.నీలవేణి, సస్యరక్షణ శాస్త్రవేత్త డాక్టర్ ఎస్.అనుష, సేద్య శాస్త్రవేత్త డాక్టర్ ఎస్.కిరణ్‌కుమార్, వ్యవసాయ సహాయకులు లావణ్య, అభ్యుదయ రైతు ముద్దాడ కృష్ణారావు పాల్గొన్నారు.


నువ్వు పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

ప్రభుత్వరంగం కార్పొరేట్లకు ఫలహారం

ప్రజాశక్తి- సంతబొమ్మాళి

కాంగ్రెస్ పార్టీ మొదటి నుంచీ పేదలకు అండగా ఉంటుందని టెక్కలి నియోజవర్గ కాంగ్రెస్ నాయకులు పేడాడ పరమేశ్వరరావు అన్నారు. 'చేయి, చేయి కలుపుదాం - రాహుల్ గాంధీని బలపరుద్దాం' కార్యక్రమంలో భాగంగా సంతబొమ్మాళిలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మంగళవారం ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేపట్టి పోస్టర్లను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశంలో పేదల కష్టాన్ని కార్పొరేట్లకు ఫలహారంగా అప్పగించేందుకు ప్రధాని మోడీ నడుం బిగించారని విమర్శించారు. ప్రజల కష్టాలను గాలికొదిలేశారని అన్నారు. మోడీ పాలనలో ప్రభుత్వ రంగ సంస్థలన్నీ ప్రయివేటు పరమవుతున్నాయని అన్నారు. దేశంలో నిరుద్యోగం పెరిగిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆంధ్రాకు ఇచ్చిన హామీలైన ప్రత్యేక హోదా, ఉత్తరాంధ్ర జిల్లాలకు ప్యాకేజీ, విశాఖ రైల్వే జోన్ ఇప్పటికీ అమలు కాలేదన్నారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న వైసిపి ప్రభుత్వం కూడా నోరుమెదపడంలేదని ఆరోపించారు. కార్యక్రమంలో కోత మధుసూదనరావు, చింతాడ దిలీప్‌కుమార్, గోపాలకృష్ణ పాల్గొన్నారు.


పోస్టర్‌ను అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

అంగన్వాడీ కేంద్రాలకు వితరణ

మెళియాపుట్టి : మండలంలోని పెద్దపద్మాపురంలో రెండు అంగన్వాడీ కేంద్రాలకు దుబ్బ లోకేశ్వరరావు, బైపోతు సత్యం ఫ్యాన్లు, స్టీల్ ప్లేట్స్, గ్లాసులు మంగళవారం అందించారు. 'ఊరు బాగుంటే మనం బాగుంటాం... మనం బాగుంటే మన ఊరు బాగుంటుందని' నినాదం తో అంగన్వాడీ కేంద్రానికి వితరణ అందజేశామ న్నారు. రానున్న వేసవి దృష్ట్యా చిన్నారులకు ఉప యోగపడే విధంగా ఫ్యాన్లు అందజేశామన్నారు.


అవగాహన కల్పిస్తున్న సిఐ సూర్యచంద్రమౌళి

హెల్మెట్ వినియోగంపై అవగాహన

టెక్కలి రూరల్: ద్విచక్ర వాహనదారులు వాహనం నడిపేటప్పుడు హెల్మెట్ దరించాలని, అనుకోని ప్రమాదాల్లో ప్రాణాపాయం నుంచి బయటపడే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని సిఐ సూర్యచంద్రమౌళి, ఎస్‌ఐ ఎల్.రామకృష్ణ అన్నారు. ప్రమాదం సంభవించినప్పుడు తలకు గాయమైతే ప్రాణానికే ప్రమాదమని అన్నారు. హెల్మెట్ ధరిస్తే తలకు గాయాలయ్యే అవకాశం తక్కువగా ఉంటుందని పేర్కొన్నారు. టెక్కలి జాతీయ రహదారిపై వాహనదారులకు మంగళవారం హెల్మెట్ వినియోగంపై కౌన్సెలింగ్ ఇచ్చారు. కార్యక్రమంలో ఎస్‌ఐ రమణ, సిబ్బంది పాల్గొన్నారు.


కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న శ్రీధర్

సచివాలయాలు దేశానికే ఆదర్శం

ప్రజాశక్తి- ఆమదాలవలస

గ్రామ, వార్డు సచివాలయాలు దేశానికే ఆదర్శమని డాక్టర్ డానేటి శ్రీధర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని మెడీకవర్ ఆస్పత్రిలో గ్రామ సచివాలయాల ఉద్యోగుల కేలండర్‌ను మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి గ్రామ వార్డు సచివాలయ వ్యవస్థ ద్వారా 1,30,000 ఉద్యోగాలు నిరుద్యోగ యువతకు కల్పించారని పేర్కొన్నారు. సచివాలయ వ్యవస్థ, ఉద్యోగుల ద్వారా ప్రజలకు ఎంతో మేలు కలుగుతుందన్నారు. కార్యక్రమంలో గ్రామ, వార్డు సచివాలయ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కూన వెంకట సత్యనారాయణ, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దవళ జానకిరామ్, బుక్క గణేష్, వర్కింగ్ ప్రెసిడెంట్ డి.దుర్గాప్రసాద్, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ వి.వైకుంఠరావు, జిల్లా జాయింట్ సెక్రెటరీ జె.అలేఖ్య, జిల్లా ఇసి మెంబర్ సాయి, జి.రమేష్, ఎస్.మల్లేష్, లిఖిత్ పాల్గొన్నారు.

చలివేంద్రం ఏర్పాటు



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంపిడిఒ ధనుంజయరావు


ప్రజాశక్తి- రణస్థలం

ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమని ఎంపిడిఒ ధనుంజయరావు అన్నారు. కోష్ట పంచాయతీలో కూడలి వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రోజురోజుకూ ఎండలు తీవ్రమవుతున్న తరుణంలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రం సహకరిస్తుందన్నారు. ఎనిమిది గ్రామాలకు కూడలి అయిన ఫై ఓవర్ వద్ద ఏర్పాటు చేసిన ఈ చలివేంద్రాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వేసవికాలంలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు పలుచోట్ల చలివేంద్రాలు ఏర్పాటు చేసేందుకు గ్రామ పెద్దలు, సచివాలయ సిబ్బంది, స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ పిసిని చిన్నంనాయుడు, సర్పంచ్ ప్రతినిధి పిసిని లక్ష్మణరావు, కార్యదర్శి హైదర్ అలీ బేగ్, సచివాలయ ఉద్యోగులు రామునాయుడు, రాజీనాయుడు, సచివాలయ కన్వీనర్ కరిమజ్జి రమణ, పల్లె సత్యం పాల్గొన్నారు. అనంతరం పైడిభీమవరం సచివాలయంలో ఏర్పాటు చేసిన ఆధార్ అప్‌డేట్స్ కేంద్రాన్ని పరిశీలించారు. ప్రత్యేక ఆధార్ శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

వేడుకగా ఫ్రెషర్స్ డే

పలాస : పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో శతశాతం ఉత్తీర్ణత సాధించి పాఠశాలకు పేరు, ప్రఖ్యాతలు తెచ్చిపెట్టాలని బ్రాహ్మణతర్ల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వైకుంఠరావు విద్యార్థులకు సూచించారు. మండలంలోని బ్రాహ్మణతర్ల ఉన్నత పాఠశాలలో పదో తరగతి వీడ్కోలు సభ మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పరీక్షలు రాసే సమయంలో మెలకువలు పాటిస్తే మంచి మార్కులు సాధించవచ్చునన్నారు. అనంతరం విద్యార్థులు ఆట పాటలతో సందడి చేశారు.

ఆమదాలవలస : మండలంలోని కొర్లకోట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు ఘనంగా వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం.దేవరాణి విద్యార్థులకు పరీక్షలు ఎలా రాయాలి, సమయపాలన ఎలా పాటించాలి తదితర అంశాలపై మేలుకువలు తెలియజేశారు. అనంతరం విద్యార్థులు సాంస్కృతిక, సినిమా పాటలకు నృత్యాలు చేశారు.కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిఆర్‌పి బొడ్డేపల్లి నర్సింగరావు పాల్గొన్నారు.


పలాస : నృత్యం చేస్తున్న విద్యార్థులు

ఆస్తి పన్ను వసూలు

ఇచ్ఛాపురం: మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజ్యలక్ష్మి అధ్యక్షతన మున్సిపాలిటీలో రూ.10,64,902 వసూలైందని కమిషనర్ రమేష్ తెలిపారు. ఈ మేరకు మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం వసూలు చేసిన డబ్బులను లెక్కించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మున్సిపల్, రెవెన్యూ అధికారుల చొరవతో కొద్ది రోజులుగా ప్రజల వద్దకు వెళ్లి బకాయితో కూడిన పన్నులను వసూలు చేశామన్నారు. కార్యక్రమంలో మూడో వార్డు కౌన్సిలర్ పత్రి తవిటయ్య, మున్సిపల్ ఆర్.అమర్ పాల్గొన్నారు.


సమీక్షిస్తున్న మంత్రి అప్పలరాజు

కెటి రోడ్డు విస్తరణ పనులు వేగవంతం

ప్రజాశక్తి- పలాస

పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని కెటి రోడ్డు విస్తరణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని మత్స్య, పశు సంవర్ధకశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు మున్సిపల్ అధికారులకు ఆదేశించారు. పలాస ప్రగతి భవన్‌లో మున్సిపల్ ఇంజినీరింగ్ అధికారులతో మంగళవారం సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కెటి రోడ్డు పనులు పూర్తి చేయడమే కాకుండా ఫుట్‌పాత్, విద్యుత్ పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు. పారిశుధ్యంపై నిరంతరం దృష్టిసారించాలన్నారు. సమావేశంలో మున్సిపల్ ఎస్‌ఇ రాజారావు, ఇఇ సుగుణాకర్, కమిషనర్ రాజగోపాల్ పాల్గొన్నారు.

సేవలు మరింత విస్తృతం

ప్రజాశక్తి- రణస్థలం రూరల్

విద్యాసాతి వాలంటరీలు సేవలను విస్తృతం చేయాలని ఎంఇఒ అజ్జాడ త్రినాథరావు అన్నారు. యూత్‌క్లబ్ బెజ్జిపురం స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యాన ఇండియా లిటరసీ ప్రాజెక్టు (ఐఎల్‌పి) సహకారంతో ఎంఆర్‌సిలో మండల స్థాయి సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇండియా లెటర్స్ ప్రాజెక్టు ద్వారా స్కూళ్లలో సైన్స్ కిట్లు ఉపయోగపడుతున్నాయని అన్నారు. కార్యక్రమంలో ప్రాజెక్టు కమ్యూనిటీ ఆర్గనైజర్ అడపా రమణమూర్తి, ఆర్.కల్పన, ఎస్.నాయుడు, క్లస్టర్ రిసోర్సన్లు పాల్గొన్నారు.


వాటర్ ట్యాంకును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

ప్రజా సంక్షేమమే ధ్యేయం

ఎమ్మెల్యే కిరణ్ కుమార్

లావేరు: ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. మండలంలోని బెజ్జిపురంలో మంగళవారం గ్రామ పంచాయతీ నిధులతో నిర్మించిన నాలుగు మినీ వాటర్ టెంకులను సోమవారం ప్రారంభించారు. అనంతరం రాగోలు జెమ్స్ ఆస్పత్రి సౌజన్యంతో ఏర్పాటు చేసిన మెగా వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సిఎం జగన్మోహన్‌రెడ్డి పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలను అందజేస్తున్నారని అన్నారు. నియోజకవర్గాన్ని అభివృద్ధికి కృషి చేస్తున్నానని, ఇటువంటి సమస్యలున్నా నేరుగా తన దృష్టి తీసుకువస్తే పరిష్కారానికి కషి చేస్తానని హామీనిచ్చారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక ఆహ్వానితులు రక్తం బాలకృష్ణ, మాజీ ఎంపిపి దన్నాన రాజినాయుడు, వైస్ ఎంపిపి లోకల్ శ్రీనివాసరావు, జి. అప్పలనాయుడు, మండల ప్రధాన కార్యదర్శి దేశెట్టి తిరుపతిరావు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలి

ఆమదాలవలస : విద్యార్థులు సేవా కార్యక్రమాల్లో విరివిగా పాల్గొనాలని చిట్టివలస సర్పంచ్ గుజ్జల జగదీశ్వరి అన్నారు. మండలంలోని చిట్టివలసలో ఆమదాలవలస ప్రభుత్వ జూనియర్ కళాశాల జాతీయ సేవా పథకం విభాగం ప్రోగ్రాం ఆఫీసర్ జలుమూరు రవిబాబు అధ్యక్షతన జాతీయ సేవా పథకం ప్రత్యేక సేవా శిబిరాన్ని మంగళవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే సేవా కార్యక్రమాల్లో పాల్గొని మంచి పేరు తెచ్చుకోవాలని సూచించారు. సర్పంచ్ ప్రతినిధి లక్ష్మణరావు మాట్లాడుతూ తమ గ్రామంలో జాతీయ సేవా పథకం ప్రత్యేక సేవా శిబిరం ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. అనంతరం గ్రామంలో వాలంటీర్లు, విద్యార్థులు అందరూ కలిసి స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో జూనియర్ కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ ఎస్.వి.ఎల్.నారాయణరావు, ఎస్.నరసింగరావు, చంద్రశేఖర్, పెంటయ్య పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎస్‌ఐ రాము

మహిళల భద్రతపై ప్రత్యేక దృష్టి

కవిటి: మహిళల భద్రతపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని, అందులో భాగంగానే మహిళల కోసం దిశా పోలీస్ స్టేషన్లు ఏర్పాటు చేసిందని ఎస్‌ఐ కె.రాము అన్నారు. మండలంలోని దూగానపుట్టుగలో సోమవారం రాత్రి పలు లఘు చిత్రాలు ప్రదర్శించింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ మనిషి వ్యసనాలకు బానిసైతే వితాలు దుర్భరమవుతాయని అన్నారు. తల్లిదండ్రులు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉంటూ తమ పిల్లల నడవడికను గమనిస్తూ ఉండాలన్నారు. అవసరమైనప్పుడు మందలించాలని సూచించారు. ఈ సందర్భంగా మహిళల భద్రత, ప్రస్తుతం సమాజంలో జరుగుతున్న మోసాలు, ప్రేమ వంచన తదితరాంశాలపై స్ఫూర్తి టీం ప్రదర్శించిన పలు లఘు చిత్రాలు గ్రామస్తులను ఆలోచింపజేశాయి. సర్పంచ్ దూగాన భద్రాచలం, కవిటి పోలీస్ సిబ్బంది, స్ఫూర్తి టీం సిబ్బంది పాల్గొన్నారు.